

ఈవీఎంలు, వివి ప్యాట్స్ తనిఖీ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం నగరంలోని పాత ఆర్డీవో కార్యాలయం ఆవరణలో ఈవీఎం గోడౌన్లో ఈవీఎంలు, వివి ప్యాట్స్‌ల మొదటి దశ తనిఖీ కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. కలెక్టర్ గౌతమి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అందరి సమక్షంలో ఆయా ఈవీఎం స్టోర్ రూమ్‌లను తెరిచారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈనెల 16వ తేదీ నుంచి నవంబర్ 10వ తేదీ వరకు ఫస్ట్ లెవెల్ చెకింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ గాయత్రీ దేవి, ఆర్డీవోలు మధుసూదన్, రవీంద్ర, తహశీల్దార్ శ్రీధర్ మూర్తి, ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్ కనకరాజు, ఎన్నికలు విభాగం సీనియర్ అసిస్టెంట్ శామ్యూల్, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయాలనూ కనుమరుగు చేసే కుట్ర

◆ కోర్సుల కుదింపు దుర్మార్గం ◆ 5వ రోజుకు చేరిన రిలేదీక్షలు

ప్రజాశక్తి-అనంతపురం

పేద విద్యార్థులకు ప్రభుత్వ విద్యను అందించే విశ్వవిద్యాలయాలనూ కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనుమరుగు చేసేలా దొంగచాటు చర్యలకు కుట్ర చేస్తున్నారని పలువురు విద్యార్థి, ప్రజాసంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్‌కెయులో ఎంఎ అడల్ట్ ఎడ్యుకేషన్ కోర్సును యథావిధిగా కొనసాగించాలని కోరుతూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో యూనివర్సిటీ వద్ద చేపట్టిన రిలేనిరాహార దీక్షలు 5వ రోజుకు చేరుకున్నాయి. సోమవారం నాడు దీక్షల్లో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్, ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయి స్వామి, ఐసా యూనివర్సిటీ కార్యదర్శి రాజునాయక్ తదితరులు కూర్చొన్నారు. వీరి దీక్షలకు కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, సిపిఎం అనంతపురం నగర కార్యదర్శి రమణారెడ్డిలు మద్దతు తెలిపారు. కరువు పీడత ప్రాంతమైన అనంతపురం జిల్లాలో విద్యాభివృద్ధిలో ఎస్‌కెయు కీలక పాత్ర పోషిస్తోందన్నారు. యువతకు ఉన్నత చదువుకు అందించి వారిని ఉద్యోగార్థులుగా చేయడంలో యూనివర్సిటీ ఎనలేని కృషి చేస్తోందన్నారు. అనేక ఆర్థిక ఒడిదుడుకులను ఎదుర్కొని అంచలంచెలుగా ఎదిగిందన్నారు. ఇలాంటి యూనివర్సిటీని అభివృద్ధి చేయాల్సిన ప్రభుత్వాలు దానిని విచ్ఛిన్నం చేసే కుట్ర చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు విభాగాలను కుదిస్తూ పేద విద్యార్థులను విద్యకు దూరం చేస్తున్నారని చెప్పారు. ఎస్‌కెయు విసి రామ కృష్ణారెడ్డి తప్పుడు నిర్ణయాలతో యూనివర్సిటీలో పలు గ్రూపులు రద్దయ్యే ప్రమాదం నెలకొందన్నారు. ఇటీవల కేంద్రంలోని బిజెపి అవలంబిస్తున్న నూతన విద్యా విధానంలో కోర్సుల రద్దు విధానాన్ని విసి అమలు చేసేందుకు పూనుకోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. అదనంగా మరిన్ని గ్రూపులను తెప్పించాల్సింది పోయి ఉన్న వాటిని రద్దు చేయడం అంటే యూనివర్సిటీ మనుగడను ప్రశ్నార్థకం చేయడమే అన్నారు. యూనివర్సిటీ పాలన కూడా గాడితప్పిందన్నారు. డిటైన్ పేర్లతో ఉన్నత విద్యకు విద్యార్థులను దూరం చేస్తున్నారన్నారు. ఒక వైపు విద్యార్థులపై ఫీజుల భారం మోపుతూ, మరోవైపు గతంలో జరిగిన అక్రమాలను సక్రమాలుగా చేసుకుంటూ విసి పదవీ కాలాన్ని కొనసాగించు కుంటున్నారన్నారు. యూనివర్సిటీలో దశాబ్దాల కాలంగా ఉన్న విభాగాలను రద్దు చేయడం విద్యార్థులకు అన్యాయం చేయడమే అన్నారు. ఎస్‌కెయులో రద్దు చేయాలనుకున్న ఎంఎ అడల్ట్ కోర్సును యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎస్‌కెయులో నెలకొన్న సమస్యలపై విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో తయారు చేసిన కరపత్రాన్ని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్ బాబు సమక్షంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఐసా రాష్ట్ర అధ్యక్షులు వేమన, డా॥ప్రతాప్, మాజీ విద్యార్థి నాయకులు డాక్టర్ అంకన్న పిడిఎస్‌యు వీరేంద్ర, జిల్లా కార్యదర్శి మంజునాథ్, నాయకులు ఉమామహేష్, విశ్వనాథ్ పాల్గొన్నారు.



ఎస్‌కెయులో నెలకొన్న సమస్యల పరిష్కారంపై ముద్రించిన కరపత్రాలను విడుదల చేస్తున్న విద్యార్థి, ప్రజాసంఘాల నాయకులు

మైనర్ విద్యార్థినిపై అకృత్యం

◆ గర్భవతిని చేసిన ఉపాధ్యాయుడు
◆ మగ శిశువుకు జననం
◆ 'అనంత' ఆసుపత్రిలో చికిత్స
◆ నిందితుడిపై పోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి -అనంతపురం ప్రతినిధి, తనకల్లు

మాయ మాటలతో మైనర్ బాలికను ఉపాధ్యాయుడు లొంగదీసుకుని, లైంగిక దాడికి పాల్పడిన ఘటన సత్యసాయి జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాలిక ప్రసవం కూడా అయ్యి మగబిడ్డకు జన్మనిచ్చింది. ఆరోగ్య పరిస్థితి బాగోలేకపోవడంతో విషయం రెండు రోజుల తరువాత బయటకొచ్చింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను కదిరి డీఎస్పీ శ్రీలత విలేకరులకు వెల్లడించారు. ఆమె తెలిపిన సమాచారం మేరకు... సత్యసాయి జిల్లా తనకల్లు మండలంలోని పరకవాండ్లపల్లికి చెందిన బాలిక మండలం కేంద్రంలోని జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఈ బాలిక గతేడాదిలో పదవ తరగతిని తనకల్లులోని జడ్పీహెచ్ స్కూల్‌లో చదివింది. ఈ సమయంలో అక్కడ తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వ్యక్తి మాయమాటలతో లొంగదీసుకుని లైంగిక దాడికి పాల్పడుతూ వచ్చాడు. ఈ క్రమంలోనే ఆమె గర్భం దాల్చింది. విషయం బయటకు తెలియక పోవడంతో బాలిక ఈ ఏడాది ఆగస్టులో జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్‌లో చేరింది. మొదటి పది రోజులు కళాశాలకు వెళ్లి అనంతరం వెళ్లలేదు. ఆ తరువాత ఇటీవల జరిగిన క్వార్టర్లీ పరీక్షలకు హాజరైంది. గత శనివారం నాడు కడుపు నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు బాలికను చికిత్స నిమిత్తం తనకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి ఆమె గర్భం దాల్చినట్టుగా నిర్ధారించారు. కడుపునొప్పి కాదని, ప్రసవ నొప్పులని గుర్తించి వైద్యం అందించారు. అక్కడే బాలిక మగశిశువుకు జన్మనిచ్చింది. రక్త హీనతతో బాధపడుతుండటంతో మెరుగైన చికిత్స కోసం వైద్యులు బాలికను కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి పంపారు. అక్కడ బ్లడ్ బ్యాంకు లేకపోవడంతో అనంతపురం సర్వజన ఆసుపత్రికి తీసుకెళ్లమని సూచించారు. ఆదివారం నాడు అనంతపురం ఆసుపత్రికి వచ్చారు. ఈ నేపథ్యంలో బాలికకు ప్రసవం అయిన సమాచారం పోలీసులకు తెలియడంతో కదిరి డీఎస్పీ శ్రీలత సోమవారం ఉదయం అనంతపురం సర్వజన ఆసుపత్రికి చేరుకుని విచారణ చేపట్టారు. ఈ విచారణలో ఉపాధ్యాయుడే కారణమని బాధితురాలు చెప్పినట్టు శ్రీలత మీడియా తెలిపారు. దీంతో సదరు వ్యక్తిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్టు ఆమె మీడియాకు వివరించారు.



అర్జీలపై జాప్యం వద్దు:కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జగనన్నకు చెబుదాం, స్పందన గ్రీవెన్స్ అర్జీల పరిష్కారంలో ఎలాంటి జాప్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ ఎం.గౌతమి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం, స్పందన గ్రీవెన్స్ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, డిప్యూటీ కలెక్టర్లు శ్రీనివాసులు, సుధారాణి, ఆన్‌సెట్ సిఇఒ కేశవనాయుడు, డిపిఒ ప్రభాకర్ రావు, వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి 323 అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం, స్పందన అర్జీలను నాణ్యతగా పరిష్కరించడంపై అధికారులు దృష్టి పెట్టాలన్నారు. పదేపదే అర్జీ పునరావృతం కాకుండా మండల స్థాయిలోనే అర్జీకు పరిష్కారం చూపే చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణలో భాగంగా బాల్య వివాహ రహిత భారతదేశం, బాల్య వివాహ రహిత ఆంధ్ర ప్రదేశ్ కు సంబంధించి బాల్య వివాహం వలన జరిగే దుష్పరిణామాలపై జాయింట్ కలెక్టర్, జిల్లా అధికారులతో ఐసిడిఎస్ పీడీ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సిపిఒ అశోక్ కుమార్ రెడ్డి, డీఆర్డీఏ పీడీ నరసింహారెడ్డి, డీపీఓ ప్రభాకర్ రావు, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి, డిఎస్ఓ శోభారాణి, నగర పాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ ఇహషాన్ బాషా, పీఆర్ ఎస్ఈ భాగ్యరాజ్ తదితరులు పాల్గొన్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ గౌతమి

పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలి

వామపక్షాల ఆందోళన

ప్రజాశక్తి-గుత్తి

పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించడంతోపాటు వ్యవసాయ మోటార్లకు మీటర్లను ఏర్పాటు చేయరాదని డిమాండ్ చేస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో సోమవారం గుత్తిలో ధర్నా నిర్వహించారు. ముందుగా సిపిఎం, సిపిఎం నాయకులు, కార్యకర్తలు గుత్తి ఆర్ఎస్‌లోని పూలే విగ్రహం నుంచి ప్రదర్శనగా ఏపీ ఎస్పీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయానికి చేరుకుని అక్కడ బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి బి.రామకృష్ణ, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రయ్య, మండల కార్యదర్శి జి.రామదాసు మాట్లాడుతూ ప్రభుత్వం వివిధ రకాలుగా విద్యుత్ ఛార్జీలు పెంచడం బాధాకరమన్నారు. ఫలితంగా సామాన్యులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అలాగే వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగిస్తే రైతులపై పెనుభారం పడుతుందన్నారు. అనంతరం ఏపీఎస్పీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాజశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు వి.నిర్మల, ఐద్వా మండల కార్యదర్శి ఎస్.రేణుక, కవిత, కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, సిపిఐ నాయకులు మధుసూదన్‌రావు, రమేష్, రాజు, మహబూబ్బీ, షఫీ, నరసింహయ్య, పూల మాబు, ఏఐటీయూసీ నాయకులు నజీర్, రజాక్, సూరి, తదితరులు పాల్గొన్నారు.



గుత్తిలో విద్యుత్ శాఖ ఎఇ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సిపిఎం, సిపిఐ నాయకులు

గుంతకల్లు : ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారంతోపాటు స్మార్ట్ మీటర్లు ఏర్పాటును నిరసిస్తూ సిపిఎం, సిపిఐ, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీల ఆధ్వర్యంలో సోమవారం విద్యుత్ డిఎఇ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల నాయకులు జగ్గలి రమేష్, గోపీనాథ్, సురేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంలోని మోడీకి మోకరిల్లి అదానీకి అనుకూలంగా విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజల నెత్తిన భారాలు మోపిందన్నారు. ఇది చాలదు అన్నట్లుగా స్మార్ట్ మీటర్లు బిగించేందుకు కుట్రలు చేస్తోందన్నారు. విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లను బిగించరాదని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు, కమిటీ సభ్యులు కసాపురం రమేష్, రామునాయక్, షాషావలిని పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం అనుబంధ ఏపి రైతు సంఘం మండల కార్యదర్శి దాసరి శ్రీనివాసులు, సిపిఎం పట్టణ కమిటీ నాయకులు కసాపురం రమేష్, సిపిఐ నాయకులు మహేష్, గోపీనాథ్, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు చిన్న తదితరులు పాల్గొన్నారు.



గుంతకల్లులో ఆందోళన చేస్తున్న వామపక్షాల నాయకులు

ఇళ్లు కట్టడానికి అడ్డుపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి

జాయింట్ కలెక్టర్‌కు అంగన్‌వాడీల వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వం తమకు ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో ఇళ్లు కడుతుంటే కొందరు అడ్డుపడుతన్నారని, పరిశీలించి చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన గ్రీవెన్స్‌సెల్‌లో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు లలితమ్మ, నక్షత్ర, జమున తదితరులు మాట్లాడుతూ తామంతా అంగన్‌వాడీ కార్యకర్తలుగా పని చేస్తున్నామని తెలిపారు. 2004 నుంచి బిఎల్ఓలుగా పని చేశామన్నారు. 2011లో అప్పటి ఆర్‌డిఓ, ఇప్పటి కలెక్టర్ ఎం.గౌతమి, తహశీల్దార్ రామకృష్ణారెడ్డి స్పందించి 69 మందికి ఉప్పరపల్లి గ్రామ పంచాయతీ, 107-1 నుంచి 7 వరకూ ఉన్న పొలంలోని ప్రభుత్వ భూమిలో ఒక్కొక్కరికి సెంటున్నర చొప్పున ఇళ్ళ పట్టాలు ఇచ్చారని తెలిపారు. అనంతపురం మండల సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రతాప్‌రెడ్డి మాకు లేఅవుట్‌లు వేసి హద్దులు చూపించారని తెలిపారు. అప్పటి నుంచి ఆ స్థలాల్లో బండలు నాటడానికి వెళ్లినప్పుడల్లా ఎవరో ఒకరూ ఆ స్థలం మాదంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. పునాదులు, వేసిన, బండలు నాటిన తొలగిస్తున్నారని తెలిపారు. ఈ మధ్య ఆ స్థలం రిజిస్ట్రేషన్ చేయించుకున్నామంటూ ఆందోళనలకు గురి చేస్తున్నారని తెలిపారు. బంగి భాస్కర్, రమేష్, మహేష్ బంజారా అనే వారు ఈ మధ్య వచ్చి ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. అప్పట్లో అంగన్‌వాడీలుగా పని చేసిన వారిలో అధిక మంది పదవి విరమణ పొందారని తెలిపారు. తామంతా కలిసి ఇళ్లు కట్టుకోవాలని సిద్ధమయ్యామని, బెదిరిస్తున్న వారి నుంచి తమ స్థలాలు కాపాడి రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన జేసీ పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.



జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న అంగన్‌వాడీలు

సమస్యలు పరిష్కరించకుంటే మెరుపు సమ్మె

సమ్మె నోటీస్ అందజేత

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

ఈనెల 23వ తేదీలోగా మున్సిపల్ కార్పొరేషన్ పర్మినెంట్ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే మెరుపు సమ్మె చేపడతామని సిఐటియు నేతలు హెచ్చరించారు. ఈమేరకు సోమవారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎటిఎం నాగరాజు ఆధ్వర్యంలో సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే 50సార్లు స్పందన కార్యక్రమంలో వినతిపత్రాలు సమర్పించామన్నారు. అయినా కార్మిక సమస్యల పరిష్కారం దిశగా అటు ప్రభుత్వంకానీ ఇటు అధికారులు కానీ చర్యలు చేపట్టిన పాపానపోలేదన్నారు. ప్రధానంగా రెగ్యులర్ కార్మికులకు రెండేళ్ల బకాయి ఉన్న సరెండర్ లీవ్‌లు, డిఏలు, ఇంక్రిమెంట్లు, సకాలంలో యూనిఫాం, పనిముట్లు ఇవ్వాలని, చనిపోయిన పారిశుధ్య కార్మికులకు డెత్ బెనిఫిట్స్ ఇప్పించాలని, టెక్నికల్ సమస్యలతో వేతనం పడని వారికి వెంటనే వేతనం ఇవ్వాలని, ఈపీఎఫ్ ఈఎస్ఐ కు సంబంధించి కన్సల్టెంట్ ను వెంటనే ఏర్పాటు చేయాలని, ఇంజినీరింగ్ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు 2011 సంవత్సరంలో 11 నెలల పిఎఫ్ బకాయి ఖాతాల్లోకి జమ చేయాలనే తదితర సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రాలు సమర్పిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా ఈనెల 23వతేదీలోపు సమస్యలు పరిష్కరించకుంటే రెండు రోజులపాటు మెరుపు సమ్మె చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ, రెగ్యులర్ కార్మికుల యూనియన్ నాయకులు ముత్తు రాజు, నల్లప్ప, ఓబుళపతి, పోతులయ్య, సంజీవరాయుడు, శ్రీనివాసమూర్తి, మరియమ్మ, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ అధికారులకు మెరుపు సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మిక సంఘం నాయకులు, కార్మికులు

20న జెఎన్‌టియులో స్పాట్ అడ్మిషన్లు

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియులో ఎంటెక్, ఎమ్మెస్సీ కోర్సుల ప్రవేశం కోసం ఈనెల 20న స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించనున్నట్లు వర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ ఆర్.కిరణ్మయి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనివర్సిటీ అడ్మిషన్ కార్యాలయంలో అడ్మిషన్లు ఉంటాయన్నారు. అర్హులైన అభ్యర్థులు 10 వ తరగతి, ఇంటర్, డిగ్రీ, మార్కుల సర్టిఫికెట్లు టిసి స్పాన్సర్‌షిప్ సర్టిఫికెట్లు, ర్యాంకు కార్డులతో పాటు సంబంధిత డీడీలు తీసుకుని హాజరుకావాలని కోరారు. విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు జిరాక్స్ కాపీలు తీసుకురావాలని సూచించారు. స్పాట్ అడ్మిషన్ పొందిన విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అనర్హులు అని తెలిపారు. ప్రొఫెషనల్ అనుభవం, గేట్-2023-పీజీ ఈసెట్-2023 ర్యాంకు, అకడమిక్ మెరిట్లకు వరుస ప్రాధాన్యత ఉంటుందన్నారు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.వెయ్యి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్ www.jntua.ac.inలో పొందుపరిచినట్లు తెలిపారు.

సీబీఎస్ఈలోనే పరీక్షలు నిర్వహించాలి

అనంతపురం క్రైం : రాష్ట్రంలో 6 నుంచి 9 వ తరగతి వరకూ సీబీఎస్ఈ సిలబస్‌ను అమలు చేస్తున్నందున పరీక్షలు కూడా సీబీఎస్ఈ విధానంలోనే నిర్వహించాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కరణం హరికృష్ణ, మాగంటి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇందులో 20 శాతం ఇంటర్నల్ మార్కులకుగానూ 80 శాతం మార్కులకు పరీక్షలు జరిగేలా, ఆబ్జెక్టివ్ విధానంలో 30 శాతం ప్రశ్నలు ఉండేలా పూర్తిస్థాయిలో సీబీఎస్ఈ విధానంలోకి మార్చాలని కోరారు. రాష్ట్రంలో సిలబస్ సీబీఎస్ఈలోనూ, పరీక్ష విధానం రాష్ట్ర స్థాయిలో ఉండటం వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు గందరగోళానికి గురవుతున్నారని తెలిపారు. సిలబస్‌కు అనుగుణంగా పరీక్ష పేపర్‌ను తయారు చేసేలా సీబీఎస్ఈ విధానాన్ని అన్ని పాఠశాలల్లో అమలు చేస్తే ఏకరీతిగా ఉంటుందని విజ్ఞప్తి చేశారు. వచ్చే విద్యా సంవత్సరం 10వ తరగతి సిలబస్ కూడా సీబీఎస్ఈ తరహాలో మారుస్తున్నందున, ఆయా పేపర్లను కూడా పూర్తిస్థాయిలో మార్చాలని, తద్వారా విద్యార్థులకు మేలు జరుగుతుందని సూచించారు.

భవిష్యత్తు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ దే..

ప్రజాశక్తి-అనంతపురం

భవిష్యత్తులో పరిశ్రమల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటెక్, నెట్ ఆఫ్ థింగ్స్‌కు అధిక ప్రాధాన్యత ఉంటుందని జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థి, కెనడా ఎస్‌వి ఎయిర్ టెంపరేచర్ సొల్యూషన్స్ కన్సల్టెంట్ శ్రీవత్సన్ వరదన్ తెలిపారు. సోమవారం అనంత జెఎన్‌టియు విశ్వవిద్యాలయం అల్యూమిని డైరెక్టరేట్, స్కూల్ అఫ్ మేనేజ్ మెంట్ సైన్సు, ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో కళాశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాబోవు కాలంలో రోబోటిక్స్, ఆర్టిఫిసియల్ ఇంటలిజెన్స్, ఇంటర్ నెట్ అఫ్ థింగ్స్ వంటి పరిశ్రమలు మరింత ప్రాధాన్యత సంతరించుకుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో జెఎన్‌టియు విసి జి.రంగజనార్ధన, అల్యూమిని డైరెక్టర్ పి.సుజాత, వైస్ ప్రిన్సిపాల్ ఇ.అరుణకాంతి, ఎంబిఎ విభాగాధిపతి టి.నారాయణరెడ్డి హెచ్‌ఒడిలు ఎస్.చంద్రమోహన్‌రెడ్డి, కెఎఫ్.భారతి, కళ్యాణి రాధ, ఎం.రామశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌వి.ఎయిర్ టెంపరేచర్స్ సొల్యూషన్స్ కన్సల్టెంట్ శ్రీవత్సన్ వరదన్

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన ఉండాలి

జెఎన్‌టియు ఫారిన్ అఫైర్స్ డైరెక్టర్ పి.సుజాత

ప్రజాశక్తి-అనంతపురం

రొమ్ము క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని జెఎన్‌టియు ఫారిన్ అఫైర్స్ డైరెక్టర్ పి.సుజాత సూచించారు. సోమవారం అనంతపురం కళాశాల ఆడిటోరియంలో 'అవేర్ నెస్ ఆన్ బ్రెస్ట్ క్యాన్సర్' అనే అంశంపై ఒక్కరోజు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇలాంటి అవగాహన సదస్సులు మహిళలకు చాలా ఉపయోగపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సవీరా క్యాన్సర్ ఆసుపత్రుల డిప్యూటీ జనరల్ మేనేజర్ ఆర్.మొహమ్మద్‌అక్రమ్, గైనకాలజిస్టు డాక్టర్ ఉదయరాణి, వర్శిటీ మహిళా సాధికారత డైరెక్టర్ వి.బి.చిత్ర, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఇ.అరుణకాంతి, పద్మ సువర్ణ, ప్రశాంతి, మహిళా సాధికారత కోఆర్డినేటర్ బి.అజిత, కె.మాధవి, ఎ.శైలాకుమారి, లలితకుమారి, కె.ఎఫ్.భారతి, డాక్టర్ అరుణ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెఎన్‌టియు ఫారిన్ అఫైర్స్ డైరెక్టర్ పి.సుజాత

తాగునీరు సరఫరా చేయాలి

గుత్తిలో ఖాళీ బిందెలతో ధర్నా

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని బీసీ కాలనీకి తాగునీరు సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ కాలనీవాసులు సోమవారం ధర్నా నిర్వహించారు. బీసీ కాలనీ నుంచి మహిళలు ఖాళీ బిందెలతో ప్రదర్శనగా గాంధీ కూడలికి చేరుకుని అక్కడ బైఠాయించి ఆందోళన చేపట్టారు. తాగునీటి సమస్య పరిష్కరించేంత వరకూ ఆందోళన విరమించమని భీష్మించుకుని కూర్చున్నారు. సమాచారం తెలుసుకున్న మున్సిపల్ డిఇఇ రఘు,ఎఇ సాయినాథ్ బాబు, వైసీపీ పట్టణ కన్వీనర్ డి. హుస్సేన్‌పీరా అక్కడికి చేరుకుని చర్చించారు. సమస్య పరిష్కారాన్ని చర్యలు చేపడతామని మున్సిపల్ అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకుడు మద్దిలేటి, జనసేన నాయకుడు పాటిల్ సురేష్, రామేశ్వరమ్మ, నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న గుత్తి బీసీ కాలనీవాసులు

ఉరవకొండ రూరల్ సిఐగా ప్రవీణ్‌కుమార్

ఉరవకొండ : ఉరవకొండ రూరల్ సిఐగా ప్రవీణ్ కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. దీంతో స్టేషన్ సిబ్బందితోపాటు, పలువురు సిఐకి శుభాకాంక్షలు తెలిపారు. తిరుపతిలో విఆర్‌లో ఉన్న ప్రవీణ్‌కుమార్ ఉద్యోగోన్నతిపై సీఐగా ఉరవకొండకు వచ్చారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ విడపనకల్, పాల్తూరు, బెలుగుప్ప, వజ్రకరూరు, కూడేరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. ప్రజలు కూడా సహకరించాలని కోరారు. అలాగే అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిఐను కలిసిన వారిలో కూడేరు, బెలుగుప్ప ఎస్ఐలు సత్యనారాయణ, రామకృష్ణ ఉన్నారు.

ఎస్‌కెయు పాలకమండలి సభ్యురాలికి సన్మానం

అనంతపురం : శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం నూతన పాలకమండలి సభ్యురాలిగా ఎంపికైన రసాయన శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.అనితను యూనివర్శిటీ వైఎస్ఆర్ విద్యార్థి నాయకులు పి.హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు తెలిపి యూనివర్సిటీ అభివృద్ధికి పాలకమండలిలో చర్చించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాసు, శివ, పూర్ణచంద్ర, అనిల్, కేశవ, నవీన్, ఎర్రిస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధి పనులకు టెండర్లు పిలవాలని వినతి

రాయదుర్గం : రాయదుర్గంలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనులకు వెంటనే టెండర్లు పిలవాలని దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణకు విప్ కాపు రామచంద్రారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు సోమవారం తన సతీమణి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్‌పర్సన్ కాపు భారతితోపాటు విజయవాడలో దేవదాయ శాఖ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే రాయదుర్గం మండలం 74-ఉడేగోళం గ్రామంలోని శివాలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఇందుకు దేవాదాయ శాఖ కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు విప్ కాపు తెలిపారు.

'ఇంటింటికీ రేషన్'పై ఫిర్యాదు

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని నడిమిదొడ్డి గ్రామంలో దాదాపు 8 నెలలకుపైగా ఇంటింటికీ రేషన్ ఇవ్వడం లేదని సిపిఎం నాయకులు అన్నారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ సురేష్‌కు సిపిఎంన నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఇంటింటికీ రేషన్ పంపిణీ కార్యక్రమం ఎక్కడా అమలు కావడం లేదన్నారు. ముఖ్యంగా నడిమిదొడ్డిలో చౌకధాన్యపు డిపో చాలా దూరంగా ఉన్నందున వృద్ధులు, వికలాంగులు, మహిళలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సర్వర్ సమస్యలతో ఇంటింటికీ రేషన్ ఇవ్వడం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇంటింటికీ రేషన్‌ను సక్రమంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సభ్యులు ప్రభాకర్, రామాంజనేయులు, చెన్నప్ప, చిన్న నాగప్ప, తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పెద్దపీట

శింగనమల : వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీలకు సిఎం జగన్ పెద్దపీట వేశారని డిసిఎంఎస్ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఎన్నో ప్రభుత్వాలు, ఎంతోమంది ముఖ్యమంత్రులను చూశామని, అయితే పార్టీలు, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత మాత్రం సిఎం జగన్‌కు దక్కుతుందన్నారు. జగన్ అధికారంలోకి వచ్చాక ప్రతి కుటుంబం ఏదో ఒక పథకం ద్వారా లబ్ధి పొందుతోందన్నారు. పైసా అవినీతికి తావులేకుండా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అవుతోందన్నారు. పథకాలు పొందేందుకు ఎవరికీ పైసా కూడా ఇవ్వడం లేదన్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో దోచుకున్నారన్నారు. జన్మభూమి కమిటీలు సిఫార్సులు చేసిన వారికే పథకాలు దక్కేవన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి మారిందన్నారు. కావున మీకు మంచి జరిగిందంటేనే జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలని కోరారు.

భక్తులకు అన్నదానం

పుట్లూరు : మండల కేంద్రంలోని మద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో సోమవారం దాతల సహకారంతో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో దాతలు బండి, రాజశేఖర్‌రెడ్డి, మద్దిలేటి గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి వార్తకు స్పందన

గంటల వ్యవధిలోనే మురుగునీరు తొలగింపు



నార్పల పాత బస్టాండ్ ఆవరణలో నిలిచిన డ్రెయినేజీ నీరు

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో పారుతున్న మురుగునీటిని ఎట్టకేలకూ అధికారులు తొలగించారు. మండల కేంద్రంలోని కూతలేరు కొత్త వంతెన ఏర్పాటు పనుల్లో భాగంగా అక్రమ కట్టడాలన్నీ కూల్చివేయడంతో వారం రోజుల నుంచి ఆ ప్రాంతంలోని డ్రెయినేజీ కాలువలు పూర్తిగా మూసుకుపోవడంతో మార్కెట్‌కు వెళ్లే దారిలో సుమారు రెండు అడుగుల వరకూ డ్రెయినేజీ నీరు నిలిచిపోయింది. దీంతో స్థానికులతోపాటు ఆ ప్రాంతంలో కిరాణా దుకాణాలు ఏర్పాటు చేసుకున్న వర్తకులు, వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దీంతో మురుగునీరు సమస్యపై ప్రజాశక్తిలో వెబ్ కథనం ప్రచురితమైంది. వెంటనే స్పందించిన సర్పంచి సుప్రియ, పంచాయతీ కార్యదర్శి అశ్వర్థనాయుడు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ రవీందర్‌నాథ్‌రెడ్డి స్పందించి గంటల వ్యవధిలోనే బస్టాండ్ ఆవరణలో నిలిచిన మురుగునీటిని తొలగించారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మురుగునీటిని తొలగిస్తున్న అధికారులు

బ్యాంకు మేనేజర్ల కృషి అభినందనీయం

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాలో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ విజయపథంలో ముందడుగు వేయటానికి బ్రాంచి మేనేజర్లు చేస్తున్న కృషి అభినందనీయమని ఎడిసిసి బ్యాంకు ఛైర్‌పర్సన్ లిఖిత అన్నారు. సోమవారం నగరంలోని ఎడిసిసి బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మేనేజర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎడిసిసి బ్యాంకు పరిధిలోని 28 శాఖల పరిధిలో బ్యాంకు మేనేజర్ల కృషి కారణంగా బ్యాంకు నేడు లాభాల బాటలో ముందుకెళ్తోందన్నారు. ఆర్‌బిఐ ఎడిసిసి బ్యాంకును వీక్ బ్యాంకు స్టేటస్ నుంచి తొలగించటం అభినందనీయమన్నారు. ఈ పరిణామం యావత్ సిబ్బంది సమిష్టి కృషి కారణమన్నారు. ముగిసిన అర్ధ సంవత్సరంలో బ్యాంకు రూ.1800 కోట్ల వ్యాపారం సాధించి నిర్దేశించుకున్న లక్ష్యాన్ని విజయవంతంగా సాధించిందని ఆనందం వ్యక్తం చేశారు. ఏడాది డిసెంబర్ చివరినాటికి రూ.2వేలకోట్ల టర్నోవర్ లక్ష్యాన్ని చేరుకోవాలని కోరారు. బ్యాంకు సీఈఓ రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ పాలకవర్గం చేస్తున్న కృషితోపాటు మేనేజర్లు క్షేత్రస్థాయిలో సిబ్బంది అంకితభావంతో పని చేయడం వల్ల బ్యాంకు మరింత అభివృద్ధి వైపు నడిపిస్తాయన్నారు. ఈ సమావేశంలో జనరల్ మేనేజర్ సురేఖారాణి, డిజిఎం సుఖదేవబాబు, రవికుమార్, నాబార్డ్ డీడీఎం అనురాధ, ఆర్‌వి.కృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎడిసిసి బ్యాంకు ఛైర్‌పర్సన్ లిఖిత



కేక్ కోస్తున్న ఎడిసిసిబి ఛైర్‌పర్సన్ లిఖిత, సిబ్బంది

నయవంచక 'కాపు'తో బిటిపికి శాపం

'కాలవ' సెల్ఫీ ఛాలెంజ్

ప్రజాశక్తి-రాయదుర్గం

తప్పుడు హామీలతో ప్రజలను మభ్యపెడుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి పెద్ద నయవంచకుడని మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు మండిపడ్డారు. సెల్ఫీ ఛాలెంజిలో భాగంగా బీటీ ప్రాజెక్టుపై సోమవారం సెల్ఫీ తీసుకుని వీడియో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలసలకు నిలయమైన గుమ్మగట్ట మండలంలోని బీ టీ ప్రాజెక్టుకు కృష్ణాజలాలు తరలించే బృహత్కార్యానికి తమ హయాంలో నిధులు తీసుకొచ్చి పనులు ప్రారంభించామన్నారు. సుమారు 20 ఏళ్లుగా నీళ్ల లేక ఒట్టిపోయిన బిటిపిని బతికించే గొప్ప పనిని తాను మొదలు పెడితే అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న కాపు రామచంద్రారెడ్డి ఎగతాళి చేశాడన్నారు. వ్యవసాయాన్నే నమ్ముకుని జీవిస్తున్న రైతుల వలసలను శాశ్వతంగా ఆపాలంటే కృష్ణాజలాలను బిటిపికి తరలించడమే ఏకైక మార్గమన్నారు. చంద్రబాబు ఆశీస్సులతో జీడిపల్లి నుండి బిటిపికి కృష్ణాజలాలను తరలించే పథకానికి రూ.968 కోట్లు మంజూరు చేయించామన్నారు. తమ హయాంలోనే 18 కిలోమీటర్ల మేర కాలువ పనులను పూర్తి చేశామన్నారు. మరో రూ.150 కోట్లతో పంపులు, మెటీరియల్ కల్యాణదుర్గంలో నిల్వ చేశారన్నారు. రెండోసారి ముఖ్యమంత్రిగా చంద్రబాబు గెలిచి ఉంటే బీటీ ప్రాజెక్టు కృష్ణ జలాలతో కళకళలాడేదన్నారు. అయితే వైసిపి అధికారంలోకి వచ్చాక ప్రాజెక్టును పూర్తిగా విస్మరించిందన్నారు. ముఖ్యంగా రెండేళ్లలో రెండుసార్లు ముఖ్యమంత్రి హామీ ఇచ్చినా కాలువ పనుల్లో ఒక్క అడుగు కూడా ముందుకు వేయకపోవడం బాధాకరమన్నారు. రైతులను దగా చేసిన జగన్, కాపు రామచంద్రారెడ్డిని రాబోయే ఎన్నికల్లో ప్రజలు చిత్తుగా ఓడిస్తారని హెచ్చరించారు.



సెల్ఫీ ఛాలెంజ్ విసురుతున్న మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు

గ్రామాల్లో ఎన్ఐఆర్‌డిపిఆర్ టీం పర్యటన

నార్పల : మండల కేంద్రంతోపాటు కేసేపల్లి, చామలూరు, బండ్లపల్లి, గంగనపల్లి గ్రామాల్లో సోమవారం హైదరాబాదుకు చెందిన ఎన్ఐఆర్ డిపిఆర్ టీం సభ్యులు పర్యటించినట్లు ఎపిఎం తిప్పమ్మ తెలిపారు. ఇందులో భాగంగా మహిళా సంఘాలకు సంబంధించిన వివిధ అంశాలను పరిశీలించారు. ముఖ్యంగా క్రెడిట్ యుటిలైజేషన్, క్యాష్ ఫ్లో జీవనోపాదులు, మహిళా సంఘాల లోన్ రికవరీ, లోన్స్ పంపిణీ, బ్యాంకు సర్వీసు ఛార్జీల గురించి సభ్యులను అడిగి తెలుసుకుని పలు పుస్తకాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీపీఎం రవీంద్రబాబు, బ్యాంకు లింకేజీ డిపిఎం ఎన్ఐఆర్డీ టీం కోఆర్డినేటర్ డాక్టర్ రమేష్, టీం సభ్యులు, సీసీలు రామకృష్ణ, నాగానంద, పుల్లారెడ్డి, విఒఎలు, సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న ఎన్ఐఆర్‌డిపిఆర్ సభ్యులు


తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు

తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల పరిధిలోని కుర్లపల్లి గ్రామస్తులు సోమవారం మండలం కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొద్ది సంవత్సరాలుగా గ్రామంలో నీటి సమస్య చాలా తీవ్రంగా ఉన్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడన్నారు. నీరు సక్రమంగా సరఫరా కాకపోవడంతో చేసేదిలేక వ్యవసాయ పంపుసెట్ల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందని వాపోయారు. ఇప్పటికైనా బోర్లు వేసి గ్రామంలో నెలకొన్న నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాప్తాడు నియోజకవర్గ సిపిఐ సహాయ కార్యదర్శి జి. శ్రీకాంత్, నాయకులు జి.దుర్గాప్రసాద్, రామాంజనేయులు, సరస్వతమ్మ, గ్రామస్తులు రవితేజ, మల్లికార్జున, బ్రహ్మయ్య, హనుమంతు, పవన్, నాగన్న, అనసూయమ్మ, అరుణమ్మ, రామాంజనమ్మ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని వినతి

గుత్తి : 1998 ఎంటిఎస్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డికి ఉపాధ్యాయులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైఎస్ జెటిఎఫ్ నాయకులు లాలూ సాహెబ్, చాంద్‌బాషా మాట్లాడుతూ 1998 ఎంటిఎస్ ఉపాధ్యాయులకు సర్వీస్ 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. అలాగే రెగ్యులర్ చేయాలని వారు కోరారు. సమస్యలను సీఎం జగన్మోహన్ రెడ్డి దష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలిపారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పిస్తున్న ఉపాధ్యాయులు

వచ్చే ఎన్నికల్లో వైసిపి జెండా ఎగరేద్దాం

మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలో వైసిపి జెండా ఎగురవేద్దామని నియోజకవర్గ ఇన్‌ఛార్జి వై.విశ్వేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఉరవకొండ వీరశైవ కల్యాణ మండపంలో ఉరవకొండ పట్టణం, రూరల్ వైసిపి విస్తృతస్థాయి సమీక్ష సమావేశాలు వేర్వేరుగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ నవంబర్ 1వ తేదీ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. పార్టీ నాయకులందరూ ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వం చేస్తున్న మంచి కార్యక్రమాలను వివరంగా తెలియజేసే బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకమై మంచి చేస్తున్న ప్రభుత్వం మీద చేస్తున్న విష ప్రచారాన్ని తిప్పికొడుతూ ప్రజలకు వాస్తవాలు వివరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ సమావేశాల్లో వైసిపి బిసి విభాగం జిల్లా అధ్యక్షుడు వీరన్న, జడ్పిటిసి పార్వతమ్మ, మార్కెట్ యార్డ్ ఛైర్‌పర్సన్ సుశీలమ్మ, సర్పంచి లలిత, బెస్త, ఎంబిసి, కురుబ కార్పొరేషన్ల డైరెక్టర్లు రమణ, జోగి.వెంకటేసులు, గోవిందు, నాయకులు సుంకన్న, ఏసీ ఎర్రిస్వామి, ఓబన్న, తేజోనాథ్, ఆసిఫ్, పార్టీ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ఎలక్ట్రిక్ స్కూటర్ షోరూం ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురంలోని కళ్యాణదుర్గం బైపాస్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఎంఎస్‌కె ఎలక్ట్రిక్ ఆటోమొబైల్ షోరూమ్‌ను రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరుగుతున్న క్రమంలో ఎంఎస్‌కె ఆటోమొబైల్స్ ఎం.శ్రావణ్‌కుమార్ నూతన షోరూంను ప్రారంభించడం అభినందనీయమన్నారు. వాహన కాలుష్యం నివారణకు ఎలక్ట్రిక్ వాహనాలు ఉపయోగపడడమే కాకుండా రవాణా ఖర్చు కూడా తగ్గుతుందన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో ఉద్యోగాలు చేసే వారికి ఎలక్ట్రిక్ వాహనాలు ఎంతో ఉపయోగంగా ఉంటాయన్నారు. నిర్వాహకులు కూడా వినియోగదారులకు అవసరమైన సర్వీస్ ని కూడా పెంచగలిగితే మరింత అమ్మకాలు పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ధనుంజయయాదవ్, విశ్రాంత అగ్రికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ కృష్ణమూర్తి, జాయ్ ఈ బైక్స్ నిర్వాహకులు, నగర ప్రముఖులు పాల్గొన్నారు.



ఎలక్ట్రిక్ ఆటోమొబైల్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

నేరాలు ఘోరాలు

వ్యక్తి ఆత్మహత్య

గుత్తి : మండలంలోని బసినేపల్లి తండా గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. జిఆర్‌పి ఎస్ఐ నాగప్ప తెలిపిన వివరాల మేరకు దాదాపు 35 సంవత్సరాలు ఉన్న వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన హెడ్‌కానిస్టేబుల్ వాసుతో కలిసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి

కర్నాటక మద్యం స్వాధీనం

అనంతపురం క్రైం : అనంతపురం జిల్లా కూడేరు మండలం మరుట్ల-2 గ్రామంలో దాడులు నిర్వహించి ఏడు బాక్సుల కర్నాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ ఇన్స్‌పెక్టర్ ఆర్.రవిచంద్ర తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు జిల్లా సెబ్ అడిషనల్ ఎస్పీ రామకృష్ణ ఆదేశాల మేరకు మరుట్ల-2 గ్రామానికి చెందిన వై.శివయ్య ఇంటి పరిసరాల్లో ఏడు బాక్సుల్లో ఉంచిన 672 కర్నాటక మద్యం టెట్రా పాకెట్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితుడు శివయ్య పరారీలో ఉన్నట్లు వివరించారు. ఈ దాడుల్లో సెబ్ ఇంటెలిజెన్స్ ఇన్స్‌పెక్టర్ నరసానాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

విషం నీరు తాగి మేకలు, గొర్రెలు మృతి

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని రాతిబావివంకలో డ్రిప్పు కోసం కలిపిన మందు తాగి ఐదు మేకలు, ఐదు గొర్రెలు మృతి చెందినట్లు పశు వైద్యాధికారిణి శిరీషా తెలిపారు. దాదాపు 80 గొర్రెలు సమీపంలోని టమోటా తోటలోకి మేపుకోసం తీసుకెళ్లారు. అక్కడ డ్రిప్పు కలిపిన మందులు తాగి ప్రాణాపాయ స్థితికి చేరుకున్నాయి. వెంటనే స్థానికులు పశువైద్యాధికారులకు సమాచారం అందించగా పశువైద్య సిబ్బంది 1962 (పశుసంవర్ధక శాఖ 108) ద్వారా ఘటనా స్థలానికి చేరుకుని వెంటనే గొర్రెలకు చికిత్స అందించారు. వివిధ కాపులకు చెందిన ఐదు గొర్రెలు, ఐదు మేకలు మృతిచెందినట్లు తెలిపారు. మృతిచెందిన జీవాల విలువ సుమారు రూ1.40లక్షలు ఉంటుందన్నారు. వైద్యం అందించిన వారిలో పశువైద్యులు డాక్టర్ శిరీషా, డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, డాక్టర్ హేమలత, పశువైద్య సిబ్బంది ఉన్నారు.

శివాలయంలో చోరీ

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని వేపరాల క్రాస్‌లోని శివాలయంలో ఆదివారం రాత్రి హుండీని పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. సోమవారం ఉదయం ఆలయ పూజారులు వీరేష్‌స్వామి, కరెన్న స్వాములు పూజ చేయడానికి వెళ్లగా చోరీ చేసిన విషయాన్ని గమణించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

జూదరుల అరెస్టు

అనంతపురం క్రైం : 4వ పట్టణ పరిధిలోని శ్రీనగర్‌కాలనీ వద్ద పేకాట ఆడుతున్న 10 మందిని అరెస్టు చేసి రూ.47,140 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ప్రతాపరెడ్డి తెలిపారు. పట్టుబడిన వారిలో పురుషోత్తం, అమర్నాథ్, మల్లికార్జున, వెంకటనారాయణ, హరిప్రసాద్, అమీర్, గోపాల్, రవీంద్ర, బాబయ్య, రాజారెడ్డి ఉన్నారు.

ప్రపంచ ఆహార దినోత్సవం

గుత్తి : జెవివి, గుత్తి కోట సంరక్షణ సమితి ఆధ్వర్యంలో సోమవారం గుత్తిలో ప్రపంచ ఆహార దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెవివి జిల్లా కార్యదర్శి పి.వెంకటరామిరెడ్డి, గుత్తి కోట సంరక్షణ సమితి కార్యదర్శి వై.రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో పేదల సంఖ్య పెరిగిపోతోందన్నారు. భారతదేశంలో ఐదేళ్లలో పేదరికం పెరిగిందన్నారు. ప్రపంచ ఆహార సూచికలో 60వ స్థానంలో ఉన్న దేశం ప్రస్తుత 125వ స్థానానికి దిగజారిందన్నారు. పేదరిక నిర్మూలనకు అన్ని ప్రభుత్వాలు కట్టుబడి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జెవివి జిల్లా నాయకులు గురుశంకర్, గుత్తి కోట సంరక్షణ సమితి ఉపాధ్యక్షుడు కాశీరావు, నాయకులు జ్ఞానేశ్వర్ రెడ్డి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులను అరికడదాం

ఉరవకొండ : దోమలను నివారించి సీజనల్ వ్యాధులను అరికడదామని పాల్తూరు పిహెచ్‌సి వైద్యాధికారులు బి.అరుణకుమారి, శివశంకర్‌నాయక్ పిలుపునిచ్చారు. సోమవారం విడపనకల్లు మండల పరిధిలోని పాల్తూరు గ్రామంలో డెంగ్యూ వ్యాధి నివారణతోపాటు సీజనల్ వ్యాధుల ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలపై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి బ్యాలా రాణి రాజశేఖర్, ఇఒఆర్‌డి సత్యబాబు, మలేరియా విభాగం అధికారి కోదండరామిరెడ్డి, పంచాయతీ సెక్రటరీ రామకృష్ణ, హెల్త్ సూపర్‌వైజర్లు సుధాకర్, యశోధ, వైద్య సిబ్బంది నాగమ్మ, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ కార్యకర్తపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

కుందుర్పి : టిడిపి ఇన్‌ఛార్జిపై వైసీపీ కార్యకర్త అసభ్య పదజాలంతో దూషించడం పట్ల మండల టిడిపి నాయకులు సోమవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ ఆదివారం రాత్రి మాయదారిపల్లిలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఉమామహేశ్వరనాయుడు న్యాయానికి సంకెళ్లు కార్యక్రమం చేపడితే వైసిపి కార్యకర్త నరసింహమూర్తి అసభ్య పదజాలంతో దూషించాడన్నారు. వెంటనే అతడిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు ధనుంజయ, నాయకులు రంగనాథ్, శివలింగప్ప, పెద్ద నరసింహప్ప, మల్లికార్జున, బసప్ప, ఆనంద్, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పాలస్తీనాకు మద్దతుగా సంఘీభావ ర్యాలీ

గుంతకల్లు : గాజాపై ఇజ్రాయిల్ సైనిక దాడిని వ్యతిరేకిస్తూ పాలస్తీనకు మద్దతుగా సిపిఐ (ఎంఎల్)న్యూ డెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయం నుంచి నినాదాలు చేస్తూ 60 అడుగుల రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్, పొట్టిశ్రీరాములు కూడలి వరకూ ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్)న్యూ డెమోక్రసీ పార్టీ డివిజన్ కమిటీ కార్యదర్శి బి.సురేష్, పట్టణ కార్యదర్శి చిన్నా, సభ్యులు రఘునాథరెడ్డి, జిలాన్, పిఓడబ్ల్యు నియోజకవర్గ కార్యదర్శి ఆశాబీ పాల్గొన్నారు.

విద్యార్థులు పఠనాసక్తి పెంచుకోవాలి

అనంతపురం కలెక్టరేట్ : విద్యార్థులు గ్రంథాలయాలను సందర్శించి పుస్తక పఠనంపై ఆకస్తి పెంచుకోవాలని గ్రంథాలయ సంస్థ అధ్యక్షురాలు ఎల్‌ఎం.ఉమామోహన్‌రెడ్డి సూచించారు. దసరా సెలవుల్లో భాగంగా సోమవారం బుక్కరాయసముద్రం ఆర్టీటీ పాఠశాల విద్యార్థులు 75 మంది కేంద్ర గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షులు ఎల్ఎం.మోహన్‌రెడ్డి, ఉప గ్రంథాలయ అధికారిణి వి.సుబ్బరత్నమ్మ, ఉపాధ్యాయులు ఇంతియాజ్ అహమ్మద్, బాషా, కావేరి, శిరీషా, ఉజ్జినేశ్వరి, గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

నార్పల : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుల పాఠశాలలో 1997లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు పాఠశాల ఆవరణలో సోమవారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు చదివేటప్పుడు ఉన్న ఉపాధ్యాయులు బయపురెడ్డి అబ్రహం, వెంకటస్వామి, కెఎల్ఎన్.ప్రసాద్, శివారెడ్డి, ప్రసాద్, వెంకట్‌నాయుడు, బేగం, మస్తాన్ వలి, చంద్రశేఖర్, వివేకానందరెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, బ్రహ్మాచారి, ప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు. ఇందులో భాగంగా పలువురు అలనాటి పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. సుమారు 16 సంవత్సరాలు క్రితం కలిసి చదువుకున్న అందరూ పాఠశాల ఆవరణలో కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. గతంలోని ఘటనలను గుర్తుంచుకుని పలువురు భావోద్వేగానికి గురయ్యారు. ఈ కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు రమేష్‌రెడ్డి, చమలూరు రాజగోపాల్, దినేష్‌రెడ్డి, షేర్‌ఖాన్, ఇలియాజ్ హరిత, ధనలక్ష్మి, విశ్వనాథ్, తానీషా, అమర్నాథ్‌రెడ్డి, రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యం

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి



ఉరవకొండలో వైద్యపరీక్షలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

ప్రతీ పేదవాడికీ మెరుగైన వైద్యం ఉచితంగా అందించి ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. సోమవారం ఉరవకొండ సచివాలయం-1 పరిధిలోని సెంట్రల్ స్కూలు ఆవరణలో సర్పంచి లలిత అధ్యక్షతన ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి ఎంతో ప్రాధాన్యమిస్తోందన్నారు. ఫ్యామిలీ డాక్టర్ ద్వారా సచివాలయాల పరిధిలో రోగుల ఇళ్లకు వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలను తెలుసుకుని తగిన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి పార్వతమ్మ, వైస్ ఎంపిపి నరసింహులు, తహశీల్దార్ హరిప్రసాద్, పంచాయతీ కార్యదర్శి గౌస్‌సాహెబ్, ఉప సర్పంచి వన్నప్ప, పిఎసిఎస్ ఛైర్మన్ వడ్ల షేక్షావలి, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గోవిందు, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ మీరం బాషా, ఎంపిటిసి వన్నూర్‌సాహెబ్, నేతలు చంగల మహేష్, సుబ్బలక్ష్మి, నిర్మలానాయక్, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె : జగనన్న ఆరోగ్య సురక్ష పథకంతో ప్రజల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని జిల్లా ఆరోగ్య వైద్యాధికారిణి దేవి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్నిపరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె క్యాంపుకు హాజరైన వారితో అన్ని ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారా.. లేదా.. అని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పోషకాహారం ఒక్క విలువలను వివరించారు. ఈ కార్యక్రమంలో తమశీల్దార్ ఉషారాణి, ఎంపిడిఒ విజయభాస్కర్, మండల వైద్యాధికారి తేజష? తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : అన్ని రోగాల నిర్మూలనకే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తీసుకొచ్చిందని ఎంపీపీ దాసరి సునీత అన్నారు. సోమవారం మండలంలోని రెడ్డిపల్లి-1 సచివాలయంలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపిపి మాట్లాడుతూ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి నరసమ్మ, ఉప సర్పంచి అరుణ, ఇఒఆర్‌డి దామోదదమ్మ, పిహెచ్‌సి వైద్యాధికారులు స్వాతి, వినోద్‌కుమార్, సెక్రటరీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పుట్లూరు : జగనన్న ఆరోగ్య సురక్షతో క్షేత్రస్థాయిల గ్రామీణ ప్రాంతవాసులకు మెరుగైన వైద్యసేవలు అందుతాయని ఎంపిడిఒ యోగానందరెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని బాలాపురం సచివాలయంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 210 మందికి వైద్యపరీక్షలు నిర్వహించినట్లు ఎంపిడిఒ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు శ్రీవాణి, డిటి మల్లేష్‌ప్రసాద్, స్పెషలిస్ట్ డాక్టర్లు, వైద్యసిబ్బంది, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

డి.హీరేహాల్ : ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే సిఎం జగన్ ధ్యేయమని వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు రాళ్ల తిమ్మారెడ్డి, మండల కన్వీనర్ వన్నూరుస్వామి అన్నారు. సోమవారం మండలంలోని పలకుర్తి గ్రామంలో ఎంపిడిఒ భాస్కర్‌బాబు ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శ్రావణ్‌కుమార్, నజరీన్, యశ్వంత్, సర్పంచులు శ్రీనివాస్‌రెడ్డి, బోయ మల్లికార్జున, ఎంపిటిసి శివలింగ, నాయకులు పులకుర్తి చంద్ర, హనుమంతురెడ్డి, నాగ, గన్నిగౌడ, కళ్లెం సురేష్, ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : రాయదుర్గం పురపాలక సంఘం పరిధిలో ఈనెల 17వ తేదీ నుంచి నవంబర్ 4వ తేదీ వరకూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు రాయదుర్గం పురపాలక సంఘం అధ్యక్షులు పోరాలు శిల్ప, మున్సిపల్ కమిషనర్ వి.దివాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17 నుంచి 26వ తేదీ వరకూ మారెమ్మ గుడి రోడ్డు వద్ద ఉన్న అభ్యుదయ పాఠశాలలో రోజూ ఉదయం 9 నుంచి వైద్యఆరోగ్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా గౌడ లేఔట్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈనెల 30 నుంచి నవంబర్ 4వ తేదీ వరకూ వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.



గార్లదిన్నెలో చిరుధాన్యాలతో తయారుచేసిన వంటకాలను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారిణి దేవి



బుక్కరాయసముద్రంలో మాట్లాడుతున్న ఎంపిపి దాసరి సునీత

బాల్య వివాహాలపై అవగాహన

ప్రజాశక్తి-నార్పల



గార్లదిన్నెలో బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

మండల కేంద్రంలోని మహిళా మండలి సమాఖ్యలో ఎపిఎం తిప్పమ్మ అధ్వర్యంలో సోమవారం బాల్యవివాహలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిడిపిఒ భారతి, హెల్త్ సూపర్‌వైజర్ అక్కులప్ప మాట్లాడుతూ బాల్య వివాహలు చేయడం నేరమన్నారు. బాల్య వివాహల కారణంగా ఆడపిల్లల ఆరోగ్య రీత్యా అనేక సమస్యలు వస్తామన్నారు. అనంతరం బాల్య వివాహాలు చేయకుండా చూస్తామని ప్రతిజ్ఞ చేశారు. తర్వాత గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సునాలిని, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.


కుందుర్పి : 18ఏళ్లు లోబడి ఉన్న చిన్న పిల్లలకు వివాహాలు చేయడం నేరమని సీసీ వీరి తిమ్మప్ప తెలిపారు. బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తూ సోమవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న వయస్సులో వివాహాలు చేయడం వల్ల బాలికల్లో రక్తహీనత తగ్గి, పిల్లలు ఎదుగుదల లేకుండా పోతుందన్నారు. అంతేగాకుండా బాల్య వివాహాలు చేస్తే చట్టరిత్యా శిక్షార్హులు అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం సుధాలక్ష్మి, యానిమేటర్, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె : బాల్య వివాహాలు చేయడం వల్ల తల్లీబిడ్డలు అనారోగ్య బారిన పడతారని వెలుగు ఎపిఎం శ్రీరాములు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని డిఆర్‌డిఎ వెలుగు కార్యాలయంలో మండలంలోని గ్రామైక్య సంఘం సభ్యులకు, స్వయం సహాయక సంఘం సభ్యులకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చిన్నతనంలో పెళ్లిళ్లు చేయడం వల్ల పుట్టబోయే బిడ్డలు అనారోగ్యంతో పుడతారన్నారు. అదేవిధంగా చదువుకునే వయసులో వివాహం కావడం వల్ల కుటుంబ సమస్యలతో సతమతమయ్యే అవకాశం ఉందన్నారు. అనంతరం సభ్యులందరితో కలిపి బాల్య వివాహాలు వివాహాలు నిర్మూలిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సీసీ రామాంజనేయులు, విడ్స్ రమేష్ బాబు, మహిళా సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.



కుందుర్పిలో ర్యాలీ చేస్తున్న ఉద్యోగులు

ముత్యాల గౌరీ అలంకారంలో వాసవీమాత



ముత్యాలగౌరీ అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు

రాయదుర్గం : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు సోమవారం రాయదుర్గం కోటలో వెలిసిన నగరేశ్వర వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారికి పంచామతాభిషేకం, నానావిధ ద్రవ్యాభిషేకం, సామూహిక కుంకుమార్చన, మహా మంగళహారతి వంటి కార్యక్రమాలు నిర్వహించారు. సాయంకాలం ముత్యాల గౌరీదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

ఉరవకొండ : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పెన్నఅహోబిలంలో స్వయంభువుగా వెలసిన ఉద్భవ మహాలక్ష్మి అమ్మవారు సోమవారం పూజలందుకున్నారు. ఇందులో భాగంగా అమ్మవారు ధాన్యలక్ష్మీదేవి రూపంలో దర్శనమిచ్చారు. తెల్లవారుజాము నుంచే అర్చకులు బాలాజీ స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి తిరుమంజన అభిషేకం, శ్రీచక్ర అర్చన, మహా మంగళ హారతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అనంతపురం : నగరంలోని అర్బన్ బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రుల మహోత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారు గాయత్రీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఇందులో భాగంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ కో-ఆపరేటివ్ సెంటర్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, బ్యాంకు ఛైర్మన్ జెఎల్.మురళీధర్, వైస్‌ఛైర్మన్ కృష్ణకుమార్, డైరెక్టర్లు గోల్డ్ బాషా, సుంకర రమేష్, మాగిశెట్టి చంద్రశేఖర్, చింతా భాస్కర్, వడ్డే మనీ, టిఎన్ఎస్ఎఫ్ లక్ష్మీనరసింహా, బ్యాంకు మాజీ మేనేజర్ లోక్‌నాథ్, అడ్వకేట్ భాస్కర్‌రెడ్డి, సీఈవో విజయభాస్కర్ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

వలసల నివారణకు 'ఉపాధి' పనులు కల్పించాలి

పుట్లూరు : మండలం కేంద్రంలో కరువు పరిస్థితులను అధిగమించడంతోపాటు వలసలను నివారించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం తక్షణం ఉపాధి పనులు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకలు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలో కరువు ఛాయలు అలుముకున్నాయన్నారు. కరువు పరిస్థితులపై చర్చించి ఉపాధి పనులు కల్పించాలని కోరుతూ వ.కా.సం ఆధ్వర్యంలో ఈనెల 17న అనంతపురంలోని సంగమేష్ ఫంక్షన్‌హాల్‌లో రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు మండల వ్యాప్తంగా కూలీలు, రైతు కూలీలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్య.కా.సం నియోజవర్గ అధ్యక్షులు సి.పెద్దిరాజు, మండల కార్యదర్శి లక్ష్మీనారాయణ, పెద్దన్న, రామాంజనేయులు, మల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధించుకుందాం

ప్రజాశక్తి-ఉరవకొండ

ప్రాణాలు ఇచ్చి అయినా ఎస్సీ వర్గీకరణ సాధించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షులు మున్నంగి నాగరాజు పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణ కోసం అలంపూర్ నుంచి హైదరాబాదు వరకూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, మహాజన సోషలిస్ట్ పార్టీ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ చేపట్టిన మాదిగల విశ్వరూప మహా పాదయాత్రకు సంఘీభావంగా సోమవారం ఉరవకొండలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద ఉరవకొండ నుంచి పెన్నహోబిలం మీదగా రాయలసీమ జిల్లాలను కలుపుకునేలా చేపట్టిన పాదయాత్రను ప్రారంభించారు. ముందుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం 29ఏళ్ల నుంచి మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఎన్నో ఉద్యమాలు చేపట్టినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ఇప్పటికైనా స్పందించి వర్గీకరణ చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు గుండాల ఈశ్వరయ్య, విశ్వనాథ్, హరిగోపాల్, సరస్వతమ్మ, భానుప్రకాష్, కదిరప్ప, శీనా, చంద్రశేఖర్, దుర్గాప్రసాద్, కేంగూరి ఎర్రిస్వామి, యల్లన్న, రమేష్‌బాబు, బెంజిమెన్, తిప్పయ్య, కోనాపురం ఎర్రిస్వామి, మోపిడి వన్నూరప్ప, గుర్రం రామాంజనేయులు, గణేష్, యల్లప్ప, సురేష్, తదితరులు పాల్గొన్నారు.